ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 30 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

30-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	27
నరసరావుపేట	35	27
బాపట్ల	36	29
రెంటచింతల	34	27
చీరాల	36	29



అపార్ట్‌మెంట్ నుంచి వ్యర్థాల సేకరణ

నరసరావుపేటలో చెత్తపన్ను!

నరసరావుపేట మునిసిపాలిటీలో పారి శుద్ధ్యం పనులను ప్రైవేటీకరించారు. రాష్ట్రం లో ఎక్కడా లేని విధంగా ఈ విధానాన్ని ఇక్కడ అమలు చేస్తున్నారు. పట్టణంలో చెత్త పన్ను వసూలు కొన సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ మునిసిపాలి టీలో వ్యర్థాల తొలగింపునకు అక్రమంగా డబ్బు వసూలు చేసి.. కొందరు దోచుకున్నారు. ఈ బాటలోనే కూటమిలోని వ్యక్తులు కూడా పయనిస్తున్నారు. ఇదంతా యథేచ్ఛగా జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన మునిసిపల్ అధికారులు.. చెత్త మార్కులకు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఆయా భవనాల నుంచి ప్రైవేట్ వ్యక్తులు వ్యర్థాల సేకరణ చేస్తున్నట్లు కమిషనర్ జస్వంత్‌రావు తెలిపారు.

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వసూలు
- అనధికారికంగా చెత్త సేకరణ ప్రైవేటీకరణ
- నెలకు రూ.1,500 నుంచి రూ.4,500
- ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి రశీదు లేని నగదు..
- నాడు వైసీపీ.. నేడు కూటమి వ్యక్తులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో శ్రీనివాసరావు అనే వ్యక్తి తన ఇంటి వద్ద వ్యర్థాలను తొలగించాలని మునిసిపల్ సిబ్బందిని కోరాడు. నెలకు రూ.1,500 చెల్లిస్తేనే తొలగిస్తామని ప్రైవేట్ వ్యక్తులు సమాధానం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్త పన్నును రద్దు చేసినా.. జిల్లా కేంద్రం నరసరావుపేటలో మాత్రం చెత్త పన్నును ఇంకా అనధికారికంగా వసూలు చేస్తూనే ఉన్నారు. ఇలా వసూలు చేస్తున్న డబ్బుకు రశీదు కూడా ఇవ్వడం లేదు. అంటే మునిసిపాల్టీ అధికారులే అనధికారికంగా చెత్త పన్ను వసూలును ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని స్పష్టంగా అర్థమవుతోంది.

రూ.1500 నుంచి రూ.4,500లు..

మునిసిపాలిటీ పరిధిలో అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, కల్యాణ మండపాలు, హోటళ్లు, బార్‌లు ఇలా వాణిజ్య సంస్థలకు సంబంధించి వ్యర్థాల సేకరణకు ప్రైవేట్ వ్యక్తులు నెలకు రూ.1,500 నుంచి రూ.4,500 వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా వసూలు చేసిన సొమ్మును మునిసిపాలిటీకి జమ చేయడం లేదు. ఇదంతా ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తోందని మునిసిపాలిటీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే తరహాలో ఐదేళ్లు వైసీపీ హయాంలో దోచుకున్నారు. ఇప్పుడు కూటమి వ్యక్తుల వంతైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టెండర్ లేదు..

మునిసిపాలిటీలో భవనాల నుంచి వ్యర్థాల సేకరణను ప్రైవేటీకరించాలంటే ఇందుకు టెండర్ నిర్వహించాలి. ఎవరి నుంచి ఎంత చెత్త పన్ను వసూలు చేయాలన్నది గజిట్‌ను మునిసిపాలిటీ ప్రకటించాలి. ఇవేవి లేకుండానే వ్యర్థాల సేకరణకు డబ్బు వసూలును ప్రైవేట్ వ్యక్తులకు అధికారులు అప్పగించడంపై చర్యలు తీసుకోవాలని పుర పౌరులు కోరుతున్నారు.

బర్లీకి.. బొనంజా

పొగాకు రైతులకు డబుల్ ధమాకా

- రంగంలోకి మార్క్‌ఫెడ్‌తో కంపెనీలూ కొనుగోళ్లు
- ఆశాజనకమైన ధర ఇస్తామంటూ రాయబేరాలు
- కేంద్రాల్లో ఊపందుకున్న బర్లీ పొగాకు కొనుగోళ్లు
- మరో 12 కేంద్రాలను తెరిచేందుకు మార్క్‌ఫెడ్ సన్నాహాలు

(బాపట్ల, పర్చూరు–ఆంధ్రజ్యోతి)

ఆశించిన మేర దిగుబడులు వచ్చినా.. ధర లేక కొన్నాళ్లు.. కొనుగోలు చేసేవారు లేక మరికొన్నాళ్లు ఆందోళన చెందిన బర్లీ పొగాకు రైతులు పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోళ్లు చేపట్టడంతో పొగాకు కంపెనీలు కూడా కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో బర్లీ రైతులకు డబుల్ ధమాకా లబ్ధి చేకూరుతోంది. ఇటీవల వరకు కొనుగోలు చేసే వారు లేక కొందరైతే అప్పులు పాలై ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. మళ్లీ పొగాకు సాగుచేయం ఎలాగోలా కొనుగోలు చేయండని రైతులు కన్నీటి పర్యంతమైనా కంపెనీలు స్పందించలేదు. బర్లీ రైతుల నుంచి కొనుగోళ్లు చేయాలని పొగాకు కంపెనీలను ప్రభుత్వం ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు ప్రభుత్వమే దేశంలో ఎక్కడా ఇప్పటి వరకు జరగనట్లుగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి బర్లీ పొగాకు కొనుగోళ్లు చేపట్టింది. అంతే గాక ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించి కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంది. కొనుగోళ్లు చేపట్టాలని పదేపదే కంపెనీలకు ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులు నిన్న వరకు పట్టించుకోని కంపెనీలు ఇప్పుడు రైతుల వద్దకు (మిగతా 7వ పేజీలో)



కొనుగోలు కేంద్రంలో పొగాకు తేమ శాతం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, కలెక్టర్ వెంకటమురళి (పాతచిత్రం)

ఇంటింటికి మంచి ప్రభుత్వం

2 నుంచి టీడీపీ శ్రేణుల సమాయత్తం

- ఏడాది అభివృద్ధి.. సంక్షేమంపై వినూత్న ప్రచారం
- వార్డు, గ్రామ స్థాయిలో చేసిన పనులపై కరపత్రాలు
- దిశానిర్దేశం చేసిన టీడీపీ అధినేత.. ముఖ్యమంత్రి చంద్రబాబు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. ఈ ఏడాదిలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. ఈ ఏడాదిలో జరిగిన మంచి గురించి ప్రజలను నేరుగా కలిసి వివరించేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు 'మంచి ప్రభుత్వం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేతలు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల గురించి వివరించాలని అధినేత దిశానిర్దేశం చేశారు. దీంతో బుధవారం నుంచి గ్రామ, వార్డు స్థాయిలో ఇంటింటికి టీడీపీ శ్రేణులు వెళ్లనున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ సాగించిన అరాచక పాలనను ప్రజలకు పార్టీ శ్రేణులు వివరిస్తాయి. ఈ ఏడాదిలో అన్నక్యాంటీన్లు, పింఛన్ పెంపు, కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాల అమలు ప్రజలకు వివరిస్తారు. అరాచక వైసీపీ పాలన.. కూటమి సుపరిపాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని చంద్రబాబు నేతలను ఆదేశించారు. వైసీపీ పాలనలో ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదని, ఇప్పుడు ప్రతీఒక్కరూ వారి అభిప్రాయలను తెలియజేసే వాతావరణం కూటమి ప్రభుత్వం కల్పించిందని ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పనున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వీరితో పాటు మార్కెట్ యార్డుల పాలకవర్గాలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్లు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను నేతలు సిద్ధం చేశారు. కార్యక్రమం అమలుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆదివారం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ప్రగతితో పాటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏడాదిలో చేపట్టిన పనులు, ప్రతి ఇంటికి అందిన సంక్షేమాన్ని తెలియజేసేలా రూపొందించిన రెండు రకాల కరపత్రాలను ప్రజలకు అందజేయనున్నారు. అదేవిధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నమోదు చేసుకుని పరిష్కరించే దిశగా సమాయత్తమవుతున్నారు. దాదాపు నెల రోజులు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమంతో ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకం కానున్నారు.



సీసీబీ నమూనా భవన చిత్రం

క్రిటికల్ కేర్ బ్లాక్.. టెండర్ ఖరారు

ఏరియా ఆస్పత్రిలో భవనం ఏర్పాటు ● 15 రోజుల్లో పనులు ప్రారంభం ● 75 పడకలు..రూ.18.09 కోట్లు వ్యయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లా కేంద్రం.. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి ఏపీ ఎంఎస్ఐడీసీ టెండర్ ఖరారు చేసింది. వ్యయంలో 12.59 శాతం తక్కువకు టెండర్ దాఖలైనట్లు సదరు అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి ఆయూష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా మిషన్ కింద నిధులు కేటాయించారు. సీసీబీ నిర్మాణానికి రూ.18.09 కోట్లు నిధులు విడుదలయ్యాయి. 15 రోజుల్లో భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలకు వరం..

క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు జిల్లా పేదల ఆరోగ్యానికి సం రక్షణగా నిలువనుంది. రెండు వందల పడకల సామర్థ్యం ఉన్న ఏరియా ఆస్పత్రికి.. సీసీబీలో 75 పడకలు కేటాయించారు. ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో ఐసీయూ, ఐసోలేషన్ వార్డులు, ఓటీ, లాబర్, డెలివరీ, రికవరీ గదులు(ఎల్‌డీఆర్) ఉంటాయి. 6,375 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మాణం కానున్న భవనంలో బెడ్‌లు, అత్యాధునిక వైద్య పరికరాలను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వం చూస్తుంది. భవన నిర్మాణానికి రూ.18.09 కోట్లు, పరికరాలకు రూ.11.40 కోట్లు ఖర్చు అవుతుంది. పూర్తి స్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని నియమిస్తారు. వీరి నిర్వహణకు ఏడాదికి రూ.5.54 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.

పోలీసు శాఖకు కృత్రిమ మేధని పంచిన హ్యాకథాన్

- మూడు రోజులు మెదళ్లకు ఐటీ నిపుణుల పని
- పోలీసుల సవాళ్లకు సమాధానాలుగా ఏఐ అప్లికేషన్లు..
- 'ఆర్‌వీఆర్' కళాశాలలో ముగిసిన హ్యాకథాన్

7

గిరిజన ప్రాంతాల్లో వసతులకు ప్రాధాన్యం

కేంద్ర షెడ్యూల్ కులాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది

న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్



రైళ్లను ఆపి.. దోపిడీ

- న్యూ పిడుగురాళ్ల స్టేషన్ సమీపంలో దొంగల హల్‌చల్
- బోగీల్లోకి చొరబడి.. ప్రయాణికుల నుంచి బంగారం అపహరణ
- సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్.. ఈ వారంలో మూడు ఘటనలు

పిడుగురాళ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్న రైల్వే అధికారుల ప్రకటనలు డొల్లని గుంటూరు డివిజన్ పరిధిలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు తెలియజేస్తున్నాయి. ఈ వారంలో పిడుగురాళ్ల సెక్షన్‌లో మూడు ఘటనలు చోటుచేసుకున్నాయి. అర్ధరాత్రి వేళల్లో ఈ మార్గంలో రైళ్లను నిలిపేసి దొంగలు బోగీల్లోకి ప్రవేశించి ప్రయాణికులను బెదిరించి బంగారు నగలను దోచుకుంటున్నారు. న్యూ పిడుగురాళ్ల - తుమ్మలచెరువు మధ్య అర్ధరాత్రి తర్వాత ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. నడికూడి - న్యూపిడుగురాళ్ల రైల్వేస్టేషన్లకు జిల్లా కేంద్రం నుంచి దూరం ఎక్కువగా ఉండటం, ఘటన ఏదైనా జరిగితే అదనపు బలగాలు వచ్చేందుకు సమయం పడుతుండటంతో ఈ ప్రాంతంలోనే ఎక్కువగా దొంగలు దోపిడీలకు పాల్పడుతున్నారని సమాచారం. శనివారం తెల్లవారుజామున విశాఖపట్నం నుంచి చర్లపల్లి వెళ్లే ప్రత్యేక రైలును న్యూపిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఆపేశారు. దీంతో 4.15 నుంచి 5.30 గంటల వరకు రైలు నిలిచిపోగా అప్పటికే అక్కడ కాచుకుని ఉన్న దుండగులు బోగీలోకి ప్రవేశించి ఇద్దరు మహిళల మెడల్లోని 50 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. అదేవిధంగా ఆదివారం తెల్లవారుజామున భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు 3.30 గంటల సమయంలో తుమ్మలచెరువు రైల్వేస్టేషన్ చేరుకునే సమయంలో నిలిచిపోయింది. అప్పటికే రైలులో ప్రయాణిస్తున్న దుండగులు ఎస్-1 బోగీలో ప్రవేశించి మహిళలను బెదిరించారు. వారు కేకలు వేయడంతో పక్క బోగీలోని తెనాలి రైల్వే ఎస్ఐ వెంకటాద్రి, కానిస్టేబుళ్లు శేషయ్య, సురేంద్రలు చేరుకున్నారు. దుండగులను గుర్తించిన ఎస్ఐ గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరపడంతో వారు అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారివైపు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న రైల్వే డీఎస్పీలు (మిగతా 7వ పేజీలో)

ప్రభుత్వ బడిలోనే నైతిక విలువలు

పాఠశాలలను బతికించుకునే బాధ్యత మనదే ● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలు ప్రభుత్వ బడిలోనే సాధ్యమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నరసరావుపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల్లో పిల్లల్ని చేరిస్తే నాణ్యమైన విద్య ఇస్తామని చెప్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ బడిని బతికించుకో వడం కోసం మన వంతు ప్రయత్నం చేద్దామని ఉపాధ్యాయులకు పిలుపిచ్చారు. రాష్ట్రంలో 52 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచుకోవడం ద్వారానే ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందుతున్నాయన్నారు. సభలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం మోహనరావు, గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే ఖాశీంపీరా, సహాధ్యక్షుడు జేవీడీ నాయక్, ఏ భాగేశ్వరిదేవి, కోశాధికారి ఎం రవిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్ సుందరరావు, డీవీ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship Programme

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programs at selected private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree or diploma program in architecture and engineering, such as Mechanical Engineering, Electrical Engineering & Electronics Engineering and production Engineering, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in selected colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh.



Prizes & Rewards:
- For engineering and architecture students: INR 1,00,000 or 75% of the annual fees (whichever is less)
- For diploma students: INR 40,000 or 90% of the annual fees (whichever is less)

Last Date: 15-07-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/BSFS4

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarship 2025-26 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: "Students enrolled in the BBA, BFIA, B.Com. (H,E), BMS, IPM, B.A. (Economics), BBS, or any other finance-related degree courses are eligible.
- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. (70% marks for PwD students)
- The annual family income of the applicants should be less than INR 6 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RMKSP5

buddy4study.com

నిన్న మొన్నటి దాకా ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల మొదటి చాయిస్ కంప్యూటర్ సైన్స్. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వచ్చిన తరువాత పరిస్థితి మారింది. మార్కెట్‌లో ఉద్యోగాలు తగ్గడం మొదలయ్యాయి. పులిమీద పుట్రలా అమెరికా జాబ్ మార్కెట్ ఇబ్బందులతో మరింత క్షీణించింది. దీంతో సీఎస్సీ చదవాలనే విద్యార్థుల ఆలోచనలు మారి కోర్ సబ్జెక్టుల వైపు దృష్టి సారించడం మొదలుపెట్టారు. అంతే కాకుండా విద్యార్థులను ఇటువైపు మళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోర్ బ్రాంచెస్‌లు ఎలా ఉంటాయో వివరిస్తున్నారు రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణరావు. ఆయన గతంలో ఎంసెట్ కన్వీనర్‌గా, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా పనిచేశారు.



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్లలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్లలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్ రోబోటిక్స్, ఏరోస్పేస్, సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, బీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా ఇలా పలు సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు

దిక్సూచి

ఎస్ఎస్‌సీ కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ, గ్రాడ్యుయేట్ లెవెల్ నోటిఫికేషన్

గ్రాడ్యుయేట్ లెవెల్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లోని 14,582 ఖాళీలను భర్తీ చేయనున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కొన్ని పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.
వయస్సు: 2025 ఆగస్టు 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
చివరి తేదీ: 2025 జూలై 4

ఎంపిక విధానం:
- టైర్-1 సీబీటీ ఆబ్జెక్టివ్ పరీక్ష
- టైర్-2 సీబీటీ - ఆబ్జెక్టివ్ పరీక్ష + స్కిల్ టెస్టులు
- డాక్యుమెంట్ వెరిఫికేషన్

వెబ్‌సైట్: https://ssc.gov.in/



కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ హయ్యర్ సెకెండరీ లెవెల్ పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ పూర్తిచేసిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 3131 ఖాళీలు ఉన్నాయి
- లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
- డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
- డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఏ)

అర్హత: ఇంటర్మీడియేట్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్ విద్యార్థులూ అర్హులు. కొన్ని పోస్టులకు మాత్రం ఇంటర్‌లో మేథ్స్ పాసై ఉండాలి.
వయస్సు: 2026 జనవరి 1వ తేదీ నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1999 జనవరి 1 నుంచి 2008 జనవరి 1వ తేదీన జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 15 సంవత్సరాల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
చివరి తేదీ: 2025 జూలై 18
వెబ్‌సైట్: https://ssc.gov.in/

చిత్రజ్యోతి

SINCE 1965

మధ్యతరగతి కుటుంబాల కథ



సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని ప్రధాన పాత్రల్లో శ్రీ గణేశ్ తెరకెక్కించిన చిత్రం '3బీహెచ్‌కే'. శాంతి టాకీస్ బేనర్‌పై అరుణ్ విశ్వ నిర్మించారు. జూలై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ ' తండ్రీకొడుకుల అనుబంధాన్ని బొమ్మరిల్లు సినిమాలో చూశారు. అలాంటి అనుబంధాన్నే ఇప్పుడు '3బీహెచ్‌కే' చిత్రంలో చూస్తారు' అని అన్నారు. నటుడు శరత్‌కుమార్ మాట్లాడుతూ 'మనమందరం మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చాం. ఇల్లు కట్టుకోవాలనే కల అందరికీ ఉంటుంది. ఇల్లు అనేది ఒక గౌరవం. కుటుంబ సభ్యులంతా ఒకే చోట కూర్చొని చూడదగిన చిత్రమిది' అని అన్నారు. చిత్రదర్శకుడు శ్రీ గణేశ్ మాట్లాడుతూ 'మా సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. చాలా ప్రేమతో ఈ సినిమా తీశాం. ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా' అని అన్నారు. చిత్ర నిర్మాత అరుణ్ విశ్వ మాట్లాడుతూ 'ఈ చిత్రం నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని అన్నారు.

భారతీయ సినీరంగం గర్వించే విషయం

- పవన్‌కల్యాణ్



హీరో కమల్ హాసన్ ఆస్కార్ కమిటీలో సభ్యుడిగా ఎంపికవ్వడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సినీరంగం గర్వించే విషయమని ప్రశంసించారు. "ప్రపంచమంతా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల కమిటీలో సభ్యుడిగా పద్మభూషణ్ కమల్ హాసన్ ఎంపికవ్వడం భారతీయ సినీరంగం గర్వించదగ్గ విషయం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన నటుడిగా, దర్శకుడిగా, కథకుడిగా భారతీయ, ప్రపంచ సినిమాపై చెరగని ముద్ర వేశారు. సినిమా మేకింగ్ విషయంలో ఆయనకు ఉన్న పట్టు స్ఫూర్తిదాయకం. ప్రపంచ సినిమాకు ఆయన ఇలాగే మరింత కాలం సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. కాగా, 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఇటీవల విడుదల చేసిన కొత్త కమిటీ సభ్యుల జాబితాలో భారత్ నుంచి కమల్ హాసన్‌తో పాటు నటుడు ఆయుష్మాన్ ఖురానా, దర్శకురాలు పాయల్ కపాడియా, ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు ఉన్నారు. హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో వీరు పాలుపంచుకోనున్నారు.





సీక్వెల్ రాబోతోంది

యూత్‌ను విపరీతంగా ఆకట్టుకున్న సినిమాల్లో 'ఈ నగరానికి ఏమైంది' ఒకటి. విశ్వక్ సేన్ కథానాయకుడిగా తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో 2018లో విడుదలైన ఈ చిత్రానికి కొనసాగింపు భాగం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఆదివారం ఈ సినిమాకు సీక్వెల్ రాబోతుందని ప్రకటించారు మేకర్స్. 'ఈఎన్ఈ రిపీట్' అనేది టైటిల్. 'ఏలినాటి శనిపోయింది. కన్యారాశి టైమ్ వచ్చింది' అనేది ట్యాగ్‌లైన్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందీ చిత్రం. మొదటి పార్ట్‌కు పనిచేసిన చిత్రబృందమే ఈ సీక్వెల్‌లోనూ భాగమవుతున్నారు. తరుణ్‌భాస్కర్ దాస్యం దర్శకత్వంలో డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మించనున్నారు. విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమతం, వెంకటేశ్ కాకుమాను ప్రధాన పాత్రలు పోషించనున్నారు.

యువతను ఆకట్టుకునేలా...



నూతన నటుడు సాయికృష్ణ హీరోగా వెంకటరమణ పసుపులేటి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలె ప్రారంభించిన ఈ సినిమాకు 'పవర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "యువతను ఆకట్టుకునే కథాంశంతో పాటు అద్భుతమైన సాంకేతిక విలువలతో చిత్రం ఉంటుంది. టాలీవుడ్‌లో కొత్త ఒరవడి సృష్టిస్తుంది" అని అన్నారు. ఆ చిత్రానికి ఎడిటర్: నందమూరి హరి, సినిమాటోగ్రఫీ: బి.ఎస్.కుమార్, సంగీతం: శంకర్ మహదేవన్.

షఫాలీ మృతికి కారణమిదేనా?



'కాంటా లగా' సాంగ్ ఫేమ్ షఫాలీ జరివాలా(42) ఆకస్మిక మృతిపై పలు అనుమానాలు రేకెత్తుతున్న సంగతి తెలిసిందే. ఆమె గుండెపోటుతో మరణించారని మొదట వార్తలు వచ్చాయి. ఆమె కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు మృతికి గల పూర్తి కారణాలను ఇంకా వెల్లడించలేదు. మరోవైపు అందంపై ఉన్న మమకారమే ఆమె ప్రాణాలు కోల్పోయేలా చేసిందని నెట్టింట వార్తలు వస్తున్నాయి. ఆమె కొంతకాలంగా యాంటీ ఏజింగ్ చికిత్సను తీసుకుంటున్నట్లు సమాచారం. శుక్రవారం ఇంట్లో పూజ ఉండడంతో ఆమె ఆ రోజంతా ఉపవాసం ఉన్నారని.. ఖాళీ కడుపుతో యాంటీ ఏజింగ్ ఔషధాలు, ఇంజెక్షన్లు తీసుకోవడంతో అవి వికటించి గుండెపోటుకు దారి తీసుంటాయని వార్తలు వస్తున్నాయి.

దేశ ఆర్థిక వృద్ధిలో ఆడిటర్ల పాత్ర కీలకం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు

గుంటూరు(తూర్పు), జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వృద్ధిలో ఆడిటర్ల పాత్ర కీలకమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. గుంటూరులోని గొట్టిపాటి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఆంధ్రపదేశ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వానికి, వ్యాపారులకు వారధిగా పనిచేస్తూ.. దేశానికి ఆదాయం సమకూరుస్తున్న ఆడిటర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. ఆడిటర్ల సమర్థత, వ్యాపారుల ఖచ్చితత్వంతో జీఎస్టీ వసూళ్లు ఏటా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించేలా కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. మరో అతిథి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర పరిధిలో వ్యాపారులు, ఆడిటర్లు ఎదుర్కొనే సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. సభకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామచర్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి రాముడు, ఆది నారాయణరెడ్డి, రాజు, షరీఫ్ ఖాన్, సునీల్, శివ, నరేష్, తిరుపాల్, మురళీ, సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



మృతి చెందిన చల్లగిరి నాగరాజు

ప్రత్తిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగు మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన చల్లగిరి నాగరాజు (45) పదేళ్లుగా పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పలు కారణాలతో సాగులో నష్టం ఏర్పడడంతో పాటు.. ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పు పెరిగి రూ.20 లక్షలు అయ్యింది. అప్పు తీర్చే మార్గం కానరాకపోవడంతో.. ప్రత్తిపాడులోని ఇటుకల బట్టీ వద్ద ఈ నెల 25న పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకుంటున్న నాగరాజును గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్‌లో అతనిని చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు.. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు శాఖకు కృత్రిమ మేధని పంచిన హ్యాకథాన్

● మూడు రోజులు మెదళ్లకు ఐటీ నిపుణుల పని
● పోలీసుల సవాళ్లకు సమాధానాలుగా ఏఐ అప్లికేషన్లు..
● 'ఆర్‌వీఆర్' కళాశాలలో ఘనంగా ముగిసిన హ్యాకథాన్

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ పోలీసింగ్‌కు అలవాటుపడిన పోలీసు శాఖ కృత్రిమ మేధని వినియోగించి వేగవంతంగా ప్రజలకు సేవలందించేందుకు సిద్ధమైంది. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఫర్ ఏపీ పోలీసు పేరుతో మూడు రోజుల పాటు చౌడవరంలోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్ ఆ శాఖకు విధుల్లో సాంకేతికంగా సహాయ పడేందుకు గట్టి నమ్మకాన్ని పెంపొందించింది. పోలీసు శాఖ ఎదుర్కొంటున్న ఎనిమిది రకాల సవాళ్లపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఐటీ రంగ నిపుణులు ఏఐని వినియోగించి అప్లికేషన్స్‌ని అభివృద్ధి చేసేందుకు శ్రమించారు. 36 గంటల పాటు తమ మెదళ్లకు పని చెప్పారు. కొందరైతే రాత్రిళ్లు కూడా విశ్రమించకుండా అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో నిమగ్నమయ్యారు. ఆదివారం సాయంత్రం హ్యాకథాన్ ముగింపు సమయానికి తాము డెవలప్ చేసిన అప్లికేషన్స్‌పై ప్రజంటేషన్స్ ఇచ్చారు. వాటిల్లో ఉత్తమమైన వాటికి రూ.75 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.50 వేల నగదు బహుమతులు పోలీసుశాఖ ఉన్నతాధికారులు అందజేసి ప్రోత్సహించారు.



హ్యాకథాన్ ముగింపు కార్యక్రమానికి హాజరైన పోలీసు అధికారులు, ఐటీ రంగ నిపుణులు

దేశంలోనే ప్రప్రథమంగా..

భవిష్యత్తుని ఏఐ శాసించనుండటంతో దీనిని ముందుగానే పసిగట్టిన సీఎం చంద్రబాబు నాయుడు ఇదే అంశాన్ని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు వివరించారు. పోలిసింగ్‌లో ఏఐ వినియోగంపై ఆలోచన చేయాలని సూచించారు. ఈ మేరకు మూడు నెలల క్రితం పోలీసు ఉన్నతాధికారులు ఆలోచనల్లో నుంచి పుట్టిందే ఈ హ్యాకథాన్. దేశంలోనే ప్రప్రథమంగా దీనిని నిర్వహించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందించింది. హ్యాకథాన్ ముగిసినప్పటికీ ఇది సుదీర్ఘ ప్రయాణానికి ఒక నాంది అని డీజీపీ పేర్కొన్నారు. ఈ హ్యాకథాన్‌కి 160 బృందాలు నమోదు చేసుకోగా 60 టీంలను షార్టులిస్టు చేశారు. రిజిస్ట్రేషన్ టెస్టుమెంట్‌ని ముగించిన తర్వాత కూడా అదనంగా మరో 40 అభ్యర్థనలు పోలీసు శాఖకు అందాయి. ఈ హ్యాకథాన్ విజయవంతం కావడానికి ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అందించిన సహకారం మరువలేనిది. ఎలాంటి ఏర్పాట్లు కావాలంటే వాటిని చకచకా చేశారు. మూడు నెలల వ్యవధిలోనే టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా అన్నింటిని కల్పించారు.

పూర్తి సహకారం

యూజ్ కేసులకు ఐపీఎస్ అధికారులు రాజకుమారి, ఫకీరప్ప, మల్లికగార్గ్, వకుల్, తుషార్, కిషోర్ మెంటార్లుగా వ్యవహరించారు. వీళ్లందరిని ఐటీ బ్యాక్‌గ్రౌండ్ ఉండడంతో పోలీసు శాఖ ఎంపిక చేసింది. పయోనీరింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ లా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ గవర్నెన్స్ టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు నిరంతరాయంగా హ్యాకథాన్ నిర్వహణకు సహకారం అందించారు. ఐటీ ఇన్‌స్పెక్టర్లు, లాజిస్టిక్స్ సపోర్టు టీం 24 గంటలు పని చేసి బృందాలకు పరికరాలను సమకూర్చి, డేటాని భద్రపరిచి షెడ్యూల్ ప్రకారం హ్యాకథాన్ జరిగేలా చేసింది. జెన్ ఏఐ, ఏజెం టిక్ ఏఐలను ఇంకా ఐటీ సంస్థలు పూర్తిస్థాయిలో స్వీకరించ లేదు. చాలామందికి ఈ పదాలు కూడా తెలియవు. అయినప్పటికీ పోలీసు శాఖ ఇందులో చూపించిన చొరవ సీఎం దార్శనికత, ఐజీ శ్రీకాంత్ నాయకత్వం, ఐపీఎస్, ఆవిష్కర్తల నిబద్ధత నుంచి వచ్చిందని డీజీపీతో పాటు ఇతర అధికారులు అన్నారు.



ఏపీ పోలీసుశాఖకు నాలెడ్జ్ పార్టనర్‌గా ఉంటూ హ్యాకథాన్ నిర్వహణకు సహకరించిన ఫోర్ సైట్ ఏఐ సంస్థ సీఈవో కోతా సూర్యకు మెమెంటోని అందజేస్తున్న డీజీపీ హరీష్‌గుమార్ గుప్తా

ఎనిమిది యూజ్ కేసుల విజేతలు, రన్నరప్‌లు

పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టం యూజ్ కేసుకు మెంటార్‌గా వకుల్ జిందాల్ వ్యవహరించగా ఇందులో కంట్రోల్డ్ ఫ్రీక్స్ విజేతగా, పారాబోలా 9 రన్నరప్‌గా నిలిచాయి. సీసీటీఎన్ఎస్ కోపైలట్ ఇంజిన్ యూజ్ కేసుకు మెంటార్‌గా తుషార్ డూడీ వ్యవహరించగా క్యాలీరెక్స్ 1, బ్లూ క్వెరీ 2, ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ఐటీ కేసెస్ - 91 సీఆర్‌పీసీ యూజ్ కేసు కు మెంటార్‌గా డాక్టర్ ఫకీరప్ప వ్యవహరించారు. ఎక్స్‌ప్లోర్మిటీ, క్వాంటం మావేరిక్స్, సీడీఆర్/ఐపీడీఆర్ కోపైలట్ ఇంజిన్ యూజ్ కేసుకు ఏలూరు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ మెంటార్‌గా.. వ్యవహరించగా ఏఐ జంట్స్, పారాబోలా 9 విజేత, రన్నరప్‌గా నిలిచాయి. డయల్ 112 ఎనలైజర్ యూజ్ కేసుకు మెంటార్‌గా మల్లిక గార్గ్, విజేతగా ఓల్ ఏఏ, రన్నరప్‌గా ఇన్ఫికోడ్ కప్స్. డిజిటల్ సర్వీసు రికార్డులు యూజ్ కేసుకు బి.రాజకుమారి మెంటార్ కాగా.. విజేతగా ట్రిపుల్ డీ, రన్నరప్ గా ఏఐ లుమినాటి నిలిచాయి. వాట్సాప్ సమ్మరైజర్ యూజ్ కేసుకు వకుల్ జిందాల్ మెంటార్‌గా వ్యవహ రించగా ప్రగ్యావర్స్ విజేతగా, సర్వ్ స్మార్ట్ రన్నరప్‌గా నిలిచారు. న్యూస్ డైజెస్టు సమ్మరైజర్ యూజ్ కేసుకు మల్లిక గార్గ్ మెంటార్ కాగా.. నేత్ర రక్షక్ విజేతగా, డైనమిక్ స్క్విరెల్స్ రన్నరప్‌గా నిలిచాయి.

విద్యా రంగంలో మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం

● టీడీపీ తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జి తాళ్ల వెంకటేష్ యాదవ్



మాట్లాడుతున్న తాళ్ల వెంకటేష్ యాదవ్

గుంటూరు (విద్య) జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జి తాళ్ల వెంకటేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులోని ఆంజనేయ పేటలో తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వెంకటేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో 62,000 మంది ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు జరిగాయన్నారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం 15 ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యలపై చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సంఘాన్ని విస్తృత పరచి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో నంబరు 117 రద్దు చేసి.. రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర సహాధ్యక్షులు పూర్ణ చంద్రరావు, రాంబాబు, మహిళా కార్యదర్శి పద్మావతి, ఏలూరు అధ్యక్షురాలు శర్వాణి, కార్యదర్శులు వెంకట్రావు, జగదీష్‌కుమార్, రామారావు, ఆంజనేయులు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, కార్యదర్శి జగదీష్‌బాబు, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సహాధ్యక్షులు శ్రీధర్, ప్రమీల రాణి, టౌన్ అధ్యక్షుడు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో వసతులకు ప్రాధాన్యం

15వ తేదీలోగా అందరికీ ఆయుష్మాన్ కార్డుల పంపిణీ

కేంద్ర షెడ్యూల్ కులాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది

బొల్లాపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర షెడ్యూల్ కులాల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది తెలిపారు. మండలంలోని హనుమాపురం శివారు పాపాయ పాలెం గ్రామంలో గిరిజనులు, చెంచులు నివాస ప్రాంతాల్లో ధర్తి అబ జనభాగిదారి అభియాన్ పథకంలో భాగంగా ఆదివారం ఆయన సందర్శించారు. తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. వెల్లటూరు చెంచుకాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయు ష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. జూలై 15 లోగా అందరికీ ఆయుష్మాన్ కార్డులను పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామయ్య, సర్పంచ్ పీపాల సాయిబాబ, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఏపీవో వాసుబాబు, ఐటీడీఏ సురేష్, ఎంఈవో కంచర్ల పార్వతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.



ధర్తి అబ జనభాగిదారి అభియాన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రిషబ్ చతుర్వేది, అధికారులు

బర్లీకి.. బొనంజా

(5వ పేజీ తరువాయి)

ప్రతినిధులను పంపి రాయబేరాలు చేస్తున్నాయి. కొనుగోళ్లు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. అంతర్జాతీయ మార్కెట్ లెక్కలను వల్లెవేయడంతో పాటు ఇష్టం వచ్చినట్లు సాగు చేశారన్న తప్పును రైతులపై కంపెనీలు వేశాయి. చివరకు ప్రభుత్వం ఈ నెల 19 నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టింది. బాపట్ల జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగగానే పొగాకు కంపెనీలు ధరపై స్వరం మార్చాయి. తాము కూడా అదే ధరకు కొనుగోలు చేస్తామంటూ ముందుకు వచ్చాయి. బర్లీకి డిమాండే లేదని నిన్నమొన్నటి వరకు చెబుతూ వచ్చిన కంపెనీలు ఇప్పుడు మాటమార్చడం గమనార్హం. ఓ వైపు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న తరుణంలో కారణాలు ఏవైనా కానీ కంపెనీలలో కూడా కదలిక రావడాన్ని బర్లీ రైతులతో పాటు ప్రభుత్వం కూడా స్వాగతిస్తోంది.

3,100 క్వింటాళ్లు కొన్న మార్క్‌ఫెడ్..

బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల నుంచి 3,100 క్వింటాళ్ల వరకు పొగాకు సేకరించింది. ఈ క్రాప్‌లో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాటన్నింటిని తొలగించడానికి కసరత్తు చేసిన యంత్రాంగం వాటిని ఓ కొలిక్కి తెచ్చి దాదాపు 13,000 ఎకరాల్లో పొగాకును అదనంగా కొనేందుకు మార్గం సుగమం చేసింది. ఇప్పటికే నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలు నడుస్తుండగా మరో 12 కేంద్రాలను అదనంగా తెరవడానికి మార్క్‌ఫెడ్ సన్నాహాలు చేస్తోంది. ఈ పరిణామాలతో కంపెనీలు కూడా పెద్దఎత్తున పొగాకు కొనుగోలు చేపట్టినట్లు సమాచారం. పైగా గ్రేడ్లతో సంబంధం లేకుండా సగటున రూ.8,000 నుంచి రూ.9,000 వరకు క్వింటాకు ధర ఇవ్వడానికి కొన్ని కంపెనీలు ముందుకు రావడం గమనించదగ్గ అంశం. బర్లీ పొగాకు సాగులో నెలకొన్న పరిణామాలతో క్రాప్ హాలిడే ప్రకటించింది. పైగా ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయశాఖ ద్వారా రైతులను ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది పొగుకు పంట ఉండదన్న సంకేతాలతో కంపెనీలు పునరాలోచనలో పడ్డాయని దీంతోనే కొనుగోళ్లకు రంగంలోకి దిగాయని తెలుస్తోంది.

రైళ్లను ఆపి.. దోపిడీ

(5వ పేజీ తరువాయి)

అక్కేశ్వరరావు, శైలేష్‌కుమార్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కాల్పులు జరిపేందుకు వెనుకాడం

రైళ్లలో దొంగతనాలకు ప్రయత్నించినా, చేసినా వారిపై కాల్పులు జరిపేందుకు కూడా వెనుకాడమని రైల్వే డీఎస్పీలు అక్కేశ్వరరావు, శైలేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. వారం వ్యవధిలో జరిగిన మూడు ఘటనలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. దోపిడీ ముఠాలు బీహార్, మహారాష్ట్రకు చెందినవిగా అనుమానిస్తున్నామన్నారు. సమావేశంలో రైల్వే ఎస్ఐలు హుస్సేన్, అంజిబాబు, మోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అమరావతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గేదెలను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన ధరణికోటలోని ఆర్‌వీవీఎన్ కళాశాల వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు మల్లాది గ్రామానికి చెందిన బుల్లా కుమార్(32) అమరావతి నుంచి స్వగ్రామం మల్లాదికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కళాశాల సమీపంలో రహదారిపై గేదెలను గుర్తించకుండా ఢీకొట్టడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా రిజర్వేషన్ కోటాల సవరణ

గుంటూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా రాకపోకలు సాగించే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ కోటాలను రైల్వే శాఖ ఇష్టారాజ్యంగా సవరిస్తోంది. తాజాగా 17232 నాగర్‌సోల్-నరసపూర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ కి ఫస్టు ఏసీ, ఏసీ టూటైర్, ఏసీ త్రీటైర్, స్లీపర్ క్లాసుల బెర్తలను సవరించింది. నాగర్‌సోల్, నాందేడ్, చర్లపల్లి నుంచి గుంటూరుకు ప్రయాణించేందుకు బెర్తుల సంఖ్య పెరిగింది. తత్కాల్, ప్రీమియం తత్కాల్ టిక్కెట్లు గతంలో కోటా ప్రకారం 32, 31 ఉంటే ఇప్పుడే 132 చొప్పున పెంచింది. వారంలో రెండు రోజులు ప్రయాణించే 17221 కాకినాడ - లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్‌కి ఫస్టు ఏసీ రెండు ఉంటే వాటిని తీసేసింది. ఏసీ టూ టైర్‌ను రెండు నుంచి ఆరుకు పెంచింది. ఏసీ త్రీటైర్‌లో 11 నుంచి 20కి పెంచింది. స్లీపర్‌లో 21 నుంచి ఎనిమిదికి కు దించింది. ప్రీమియం తత్కాల్‌లో మాత్రం బెర్తుల సంఖ్య పెంచుకుంది. 17655 కాకినాడ-పుదుచ్చేరి సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కి న్యూ గుం టూరులో ఎలాంటి కోటా లేదు. ఈ రైలుకు స్లీపర్ బెర్తులు గతంలో 51 ఉంటే 74కి పెంచింది. 17644 కాకినాడ - చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రె స్‌కు విజయవాడ రిమోట్ లోకేషన్‌లో స్లీపర్ బెర్తుల సంఖ్య 51 నుంచి 40కి తగ్గించింది. ఏసీ త్రీటైర్ 18 నుంచి 14కి కుదించింది. ఏసీ టూటైర్‌లో ఉన్న ఒక బెర్తను తీసేసింది. 17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో గతంలో 24 స్లీపర్ క్లాస్ బెర్తులు గుంటూరు రిమోట్ లోకేషన్‌లో ఉండేవి. ఇప్పుడు వాటిని 12కు తగ్గించారు. ఏసీ త్రీటైర్‌లో కూడా ఆరు నుంచి నాలుగుకి బెర్తులు తగ్గించారు.

మహా వారాహిదేవిగా బగళాముఖి



వారాహిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పిట్టలవానిపాలెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగవ రోజు ఆదివారం అమ్మవారిని మహా వారాహిదేవిగా అలంకరించినట్లు ఆలయ ఈవో జి.నరసింహమూర్తి తెలిపారు. రాష్ట్రం సస్యశ్యామలం కావాలని, భక్త జనులకు సంతోష జీవనాన్ని అనుగ్రహించాలని అమ్మవారిని కోరినట్లు ఈఓ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహంకాళికి నిమ్మకాయల అలంకరణ



నిమ్మకాయల దండల అలంకరణలో మహంకాళీ అమ్మవారు

దుగ్గిరాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి ఆలయం ఆషాఢ మాసం తొలి ఆదివారం భక్తులతో కళకళలాడింది. పంచమి తిధి పురస్కరించుకుని అమ్మవారికి 2 వేల నిమ్మకాయలు కూర్చిన దండల అలంకరణ కనువిందు చేసింది. అమ్మవారి ప్రాంగణాన్ని 23 రకాల పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు తెల్లవారు జాము నుంచే అమ్మ వారిని దర్శించుకునేందుకు ఆలయ గాలిగోపురం నుంచి క్యూ కట్టారు. రెండో ఆదివారం అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ సునీల్‌కుమార్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగ ప్రసాద్ తెలిపారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు (విద్య) జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నంది వెలుగు రోడ్డులోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 7, బైపీసీలో 19, సీఈసీలో 18 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు సోమవారం సాయంత్రానికి దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాన్ని నడపరాదు

● ఎస్ఐ ప్రవీణ్

బెల్లంకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాన్ని నడపరాదని ఎస్ఐ ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం బెల్లంకొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలకు అపరాధ రుసుం వసూలుచేశారు. తనిఖీల్లో సిబ్బంది షణ్ముక్, ఎల్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పట్లగూడెం, వెంకటాయపాలెం, అడవి రోడ్డును పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణ ప్రియ

పుట్లగూడె-వెంకటాయపాలెం రోడ్డు.. డీఎఫ్‌వో పరిశీలన

అచ్చంపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లగూడెం-వెంకటాయపాలెం తండా ఫారెస్టు రోడ్డును ఆదివారం డీఎఫ్‌వో పరిశీలించారు. ఈ రోడ్డులో కంపచెట్లు తొలగించి రహదారిని విస్తరించాలంటూ గిరిజనులు గతంలో ఫారెస్టు అధికారులకు వినతిపత్రాలు అందించారు. రోడ్డు పక్కన గిరిజనుల దేవత తుల్జాభవానీ గుడి ఉంది. అక్కడి నుంచి వెంకటాయపాలెం వరకు బ్రిటీషు కాలంలోనే గెజిట్‌లో రోడ్డు ఉంది. రాకపోకలకు ప్రయాణీకులకు ఇబ్బందిగా ఉందని, వెంకటాయపాలెం తండా ప్రజలు అఖిల భారతీయ గిరిజన వికాస్ పరిషత్ సంఘం ద్వారా రెండు నెలల క్రితం నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్‌ను ఆశ్రయించారు. కమిషన్ స్పందిస్తూ దీనిపై తగు సమాచారంతో జూలై 9వ తేదీన ఢిల్లీకి విచారణకు రావాల్సిందిగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో డీఎఫ్‌వో కృష్ణప్రియ చింతపల్లి బీట్ పరిధిలో 12 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డును పరిశీలించి ముళ్లపొదలు తొలగిస్తామని స్థానికులకు తెలిపారు. డీఎఫ్‌వోతో పాటు రేంజ్ అధికారి వెంకటరమణ, డీఆర్‌వో కుసుమకుమారి, అటవీసిబ్బంది, అఖిల భారతీయ గిరిజన వికాస్ పరిషత్ సంఘ అధ్యక్షుడు బీటీ నాయక్, కార్యదర్శి భూక్య రమేష్‌నాయక్, సంద్ర తండా ప్రజలు, వెంకటాయపాలెం వాసులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

పులిపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం

గురజాలటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడులో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆశీస్సులతో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 850 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యులు ఉన్నం దీపిక, ప్రత్యూష, సాయి నివేద్, అశోక్, వెంకటరామిరెడ్డి, నవులూరి రామకృష్ణ, స్మిత, రామమోహన్ వైద్య సేవలందించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 19.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 1700 క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా, 300 క్యూసెక్కులు లీకుల ద్వారా, మొత్తం 2వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అమరావతి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన షేక్ శ్రీనివాసరావు(40) శనివారం మధ్యాహ్నం పెదకూరపాడు వైపు నుండి లింగాపురం గ్రామానికి వస్తుండగా వాహనం జారి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాసరావును వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. శ్రీనివాసరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కాల్వల ఆధునీకరణ పనులు ప్రారంభం

పిడుగురాళ్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆకురాజుపల్లె మేజర్ పరిధిలో మేజర్, మైనర్ కాల్వల ఆధునీకరణ పనులను ఆదివారం డీసీ ఛైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కాల్వ చివరి భూములకు సాగునీరందించేందుకు నిధులు మంజూరయ్యాయని, నీటి విడుదల అయ్యేలోపు పనులు పూర్తయ్యేలా త్వరితగతిన చేయిస్తామని ఈఈ రమేష్, డీఈ ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎల్ సాంబశివరావు, భిక్షమయ్య, మేకల రాంబాబు, కొరముట్ల ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీని కలసిన విజయకుమార్

సత్తెనపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను లోక్ జనశక్తి పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయకుమార్ ఆదివారం గుంటూరులో ఆయన గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లా అభివృద్ధికి, ముఖ్యంగా సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఆయనతో పాటు కారుమంచి గంగారాజు ఉన్నారు.

మ్యుటేషన్‌కు అవకాశం కల్పించండి

● రీ-సర్వే గ్రామాల రైతుల విజ్ఞప్తి



రీసర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

నకరికల్లు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో అడంగల్‌లో కాలం నంబరు 6లో ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు మ్యుటేషన్ చేసుకొనే అవకాశం లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాం నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ప్రభుత్వం రైతులకు వర్తింపజేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు అర్హత ఉన్నా.. లబ్ధి పొందలేక పోతున్నారు. రీసర్వేకు ముందు బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన రైతులు మ్యుటేషన్‌కు అవకాశం లేకపోవడంతో పంట రుణాలు చెల్లించినా.. తిరిగి రుణాలు పొందలేక పోతున్నారు. ప్రభుత్వం విడతల వారీగా భూపంపిణీ చేసిన గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. లబ్ధిదారులు వెబ్ ల్యాండ్‌లో పట్టాదారుగా నమోదు చేసుకొనేందుకు గ్రామ సచివాలయాల్లోనూ దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు లేదు. దీంతో రీ-సర్వే జరిగిన, జరుగుతున్న గ్రామాల్లోనూ అసైన్డ్ భూములు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు తాము దూరమవుతున్నామని, పంట రుణాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలకు దూరం

ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకాలకు అర్హత ఉన్నా మీ భూమి పోర్టల్‌లో.. తమ పేర్లు నమోదు కానందున కొందరు లబ్ధి పొందలేక పోతున్నారు. ఏటా బ్యాంకుల్లో పంట రుణం పొంది, సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందే అవకాశానికీ దూరమవుతున్నారు. అలాగే ప్రభుత్వం ఉద్యాన పంటలకు కల్పిస్తున్న రాయితీలను పొందలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వం జీవనాధారం కల్పించిన అసైన్డ్ భూముల రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. అయితే.. అడంగల్‌లో కాలం - 6లో మ్యూటేషన్‌కు అవకాశం కల్పిస్తే రీ-సర్వే జరిగినప్పటికీ ఎవరికీ ఎలాంటి నష్టం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యకు పరిష్కారం సూచించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదల పెన్నిధి రంగా

● విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ప్రవీణ్





సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఇన్‌సెట్లో వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధా, ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన్‌రంగా ఒక శక్తి, పేదల పాలిటి పెన్నిధి అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా సమస్యల పరిష్కారంలో ముందున్నాడన్నారు. ఆయన కుల, మతాలకు అతీతంగా పని చేశాడన్నారు. మండల కాపు నాడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాపునాడు సంఘ రాష్ట్ర ప్రతినిధి గంధం కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు రంగాను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం వంగవీటి రాధాను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ప్రవీణ్‌తో పాటు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వడ్లాణం హరిబాబు, గాదె వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రామకృష్ణ, కంబాల వీరబాబు, కొలగాని సత్యనారాయణ, నందిగం ఆశీర్వాదం, మట్టం వీరభద్రరావు, వల్లపనేని వెంకటేశ్వరరావు, పోలిశెట్టి సత్యనారాయణ, అన్నం రామకృష్ణ, తోట పాపారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాపునాడు నాయకులు, కార్యకర్తలతో పాటు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యేలు



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా



సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, ధారునాయక్, మధుబాబు

సత్తెనపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులతో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు.

● మాచర్లటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటితోపాటు ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్, రాష్ట్ర కార్యదర్శి చిరుమామిళ్ల మధుబాబు పాల్గొన్నారు.

నాలుగు మండలాలకు ఒక్కరే..

● రెండేళ్లుగా బాధ్యతలు చూస్తున్న పెదకూరపాడు ఎంఈఓ
● మూడు మండలాలకు భర్తీ కాని విద్యాశాఖాధికారి పోస్టులు

క్రోసూరు ఎంఈవో కార్యాలయం



క్రోసూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఒకే ఒక్కరు సంవత్సరాలుగా మండల విద్యాధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పనిభారం అధికమై.. కొన్ని పనుల్లో జాప్యం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా.. పెదకూరపాడు రెగ్యులర్ ఎంఈవో ఏకుల ప్రసాదరావు బెల్లంకొండ మినహా అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల బాధ్యతలనూ రెండేళ్లుగా చూస్తున్నారు. నాలుగు మండలాల్లో 500కు పైగా మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎంఈవో ప్రతిరోజు రెండు పాఠశాలలను తనిఖీ చేయడంతోపాటు ఉపాధ్యాయుల హాజరు సక్రమంగా ఉందో లేదో చూడాలి. ఉపాధ్యాయుల సర్వీసు బుక్‌లు, స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వాహణ, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకోవడం, మధ్యాహ్న భోజనం తనిఖీలు మొదలైనవి అన్ని పర్యవేక్షించాలి. విద్యా సంవత్సరం సంవత్సరం మొదట్లో పాఠ్య పుస్తకాలు, రాతపుస్తకాలు, యూనిఫాంలు, విద్యాకిట్ల పంపిణీ వంటివి సక్రమంగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతినెలా చివరిలో ఉపాధ్యాయుల జీతాల నివేదికలు పంపించాలి. ఒకే ఎంఈవో నాలుగు మండలాల బాధ్యతలు నిర్వహించాలంటే అత్యంత భారంగా, పని ఒత్తిడి అధికంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి.

ఉపాధ్యాయుల సహకారంతో విధులు

- ఎంఈవో ఏకుల ప్రసాదరావు



నాలుగు మండలాల ఎంఈవోగా పని ఒత్తిడి అధికంగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల సహకారంతో విధులు నిర్వహిస్తున్నాను. ఎంఈవో కార్యాలయాల్లో సిబ్బంది సహకారం కూడా తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు వివిధ మండలాల పాఠశాలల పని తీరును పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులకు ఎటువంటి ఆటంకం కలగకుండా పని చేసుకుంటూ పోతున్నాం.



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

తుమ్మకోట లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులు కోరతాం

● ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మకోట గ్రామ శివారు కొత్తగంగరాజు పల్లె వద్దగల కృష్ణానదిపై లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ ఆవశ్యకతను మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. ఆదివారం ఎమ్మెల్యే రెంటచింతలలో విలేకరులతో మాట్లాడుతూ గత ఆరేళ్లుగా పెండింగ్‌లో వున్న ఈ లిఫ్ట్ ఇరిగేషన్ అనుమతులకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదన్నారు. కొత్త గంగరాజుపల్లె, కొత్తూరు, కొత్తపల్లి, కొత్తపుల్లారెడ్డి గూడెంలలో మొత్తం 15,900 ఎకరాల ఆయకట్టుకు గాను గతంలో అంచనాలు తయారు చేశారని చెప్పారు. తుమ్మకోట లిఫ్ట్‌కు రూ.22 కోట్లు ఖర్చవుతుందని, దీనికి సంబంధించి కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రెవెన్యూ అధికారులు న్యూమ్యాప్, ఆయకట్టు, సర్వేనెంబర్లతో సమగ్ర సమాచారాన్ని ఇస్తే అనుమతుల కోసం ప్రభుత్వాన్ని కోరతామన్నారు. ఏపీఎస్ఐడీసీ ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, శౌరెడ్డి, ప్రభురాజ్ యాదవ్, సన్నెగంటి సిద్దయ్య తదితరులున్నారు.

జర్నలిస్టుల నిరసన ర్యాలీ

క్రోసూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మహాన్యూస్ కార్యాలయంపై బీఆర్ఎస్ కార్యకర్తలు జరిపిన దాడికి నిరసనగా ఆదివారం క్రోసూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నాలుగు రోడ్ల సెంటర్ నుంచి అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు కొనసాగింది. ఆ విగ్రహాలకు వినతిపత్రం సమర్పించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి..

రెంటచింతల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛను అణచివేయడానికి బీఆర్ఎస్ శ్రేణులు చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ మండల కార్యదర్శి కె.రంగనాయకులు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో మహాటీవీ కార్యాలయంపై దాడి పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

జాతీయస్థాయి సదస్సుకు పల్నాడు జిల్లా నుంచి ఇద్దరు ఛైర్మన్‌ల ఎంపిక

చిలకలూరిపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): హర్యానాలోని గురుగ్రామ్‌లో జూలై 3, 4 తేదీలలో జరిగే జాతీయస్థాయి సదస్సుకు పల్నాడు జిల్లా నుంచి ఇద్దరు మున్సిపల్ ఛైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు మున్సిపల్ పాలన శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపికైనవారిలో చిలకలూరిపేట, మాచర్ల మునిసిపల్ ఛైర్మన్‌లు షేక్ రఫాని, షేక్ మదార్‌సాహెబ్ ఉన్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పట్టణ, స్థానిక సంస్థల ఛైర్మన్‌లకు "రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ, స్థానిక సంస్థల పాత్ర" అనే అంశంపై అవగాహన కల్పిస్తారు. రాష్ట్రం నుంచి మొత్తం 25మందిని ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఎంపిక చేశారు.

ఆషాడమాస బోనాలతో దేవాలయాల్లో సందడి



పిడుగురాళ్ల: ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



దుర్గి: అమ్మవారి పల్లకి సేవలో భక్తులు

పిడుగురాళ్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం పురస్కరించుకొని పట్టణంలోని భవానినగర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి మొదటి ఆదివారం రోజు భక్తులు బోనాలు సమర్పించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మతల్లికి ఆషాడమాసం మొదటి ఆదివారం బోనాలు సమర్పించేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అంకాళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు


కారంపూడి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం తొలి ఆదివారం సందర్భంగా కారంపూడిలోని వీర్ల అంకాళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి వాసు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని చీర, సారె సమర్పించారు. వీరాచారవంతులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం వీరుల దేవాలయంలో పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించారు. పూర్వీకుల ఆయుధాలకు పూజలు చేశారు.

ఉన్మత్తదేవి అలంకారంలో అమ్మవారు

నకరికల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా కుంకలగుంటలోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో ఆదివారం ఉన్మత్త దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను అర్చకులు మామిళ్ళపల్లి విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు.

శ్రీలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

దుర్గి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, యజ్ఞ యాగాదులు జరిపారు. సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిషనర్, ఈవో ఆదిశేషునాయుడు, శాశ్వత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.





గ్రామీణ ప్రజలకు వైద్యసేవలందించటంలో సంతృప్తి..



నకరికల్లు: వైద్యులకు షీల్డ్ అందజేస్తున్న అట్లూరి శాంతి



ముప్పాళ్ల: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

నకరికల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించటం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఏఎం రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి అన్నారు. ఆదివారం మండలంలోని చేజర్ల గ్రామంలో ఏఎం రెడ్డి విద్యాసంస్థలు, కేసీ ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ సంయుక్తంగా ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 600 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేసి సూచనలను చేశారు. శిబిరంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్ భూషణరావు, డాక్టర్ లక్ష్మీసురేఖ, డాక్టర్ జీ గోపాలకృష్ణ, దేవిరెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి, డాక్టర్ ఓటిసేని లోకేశ్ రెడ్డి, వైద్యులు డాక్టర్ ఎంఎస్ సుధీర్ కుమార్‌రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, డాక్టర్ రామిరెడ్డి సునీతకుమారి సేవలు అందించారు. ఏఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారు.

210 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ముప్పాళ్ళ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో తేజ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ బొట్ల రఘు ప్రసాద్, స్త్రీల ప్రసూతి వైద్యనిపుణులు కర్నాటి శ్రావణి, కంటి వైద్యనిపుణులు దండమూడి వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ డాక్టర్ బొట్ల రంగతేజలు వైద్యపరీక్షలు నిర్వహించారు. 210మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తాడువాయి శివనాగరాజు, పోలిశెట్టి శివప్రసాద్, కొంజేటి జగన్నాథరావు పాల్గొన్నారు.



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

5 న జాతీయ లోక్ అదాలత్

● ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని రెండు కోర్టులలో రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు 394వరకు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఆయా కేసులకు సంబంధించిన రెండు పార్టీల వారు హాజరై రాజీ చేసుకుంటే వెంటనే వాటిని నమోదుచేసి లోక్ అదాలత్ అవార్డు అదేరోజున ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకుంటే కోర్టు సమయం వృధా కాదని, వారు కట్టిన కోర్టు ఫీజు కూడా వెనక్కి ఇవ్వటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులు ప్రామిసరీ నోట్లు, చెక్కు కేసులు, సివిల్ దావాలు సులభంగా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్తయిన జాలాది-కొప్పర్రు మార్గం



గ్రావెల్‌తో వేసిన జాలాది-కొప్పర్రు డొంక మార్గం

● రూ.30లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణం
● సాకారమైన మండల ప్రజల కల

యడ్లపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న మండల ప్రజల ప్రజల కల ఎట్టకేలకు సాకారం అయ్యింది. యడ్లపాడు-పెదనందిపాడు మండలాలను కలిపే జాలాది-కొప్పర్రు లింకురోడ్డుకు మోక్షం లభించింది. రహదారి నిర్మాణంతో రెండు మండలాల్లోని పది గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడినట్లయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధ్వానంగా ఉన్న రహదారితో పలు గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి మండల నాయకులు తీసుకెళ్ళగా స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరుచేశారు. సుమారు 1,200మీటర్ల పొడవు, 4.5మీటర్ల వెడల్పుతో రెండు గ్రామాల మధ్య పొలాల మీదుగా రహదారి నిర్మాణాన్ని పూర్తిచేశారు. పనులు ప్రారంభించిన నాలుగు నెలల్లోనే నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణంతో మండల కేంద్రమైన పెదనందిపాడుకు వెళ్లాలంటే చిలకలూరిపేట లేదా ప్రత్తిపాడు మీదుగా సుమారు 15 కిలోమీటర్ల చుట్టు తిరిగి వెళ్ళాల్సి వచ్చేదని, జాలాది-కొప్పర్రు గ్రామాల మధ్య 1.2కి.మీల లింకురోడ్డు నిర్మాణంతో సుమారు 10కి.మీల మేర దూరం తగ్గిందన్నారు. దూరం తగ్గడంతోపాటు సమయం కూడా కలిసి వస్తుందని, రెండు మండలాల మధ్య ప్రజలు రాకపోకలు సాగించేందుకు, కొప్పర్రు, జాలాది, గుత్తావారిపాలెం, కారుచోల తదితర గ్రామాల రైతులు తమ పంట ఉత్పత్తులను ఇళ్ళకు చేరవేసుకునేందుకు ఈ మార్గం ఎంతగానో దోహదపడుతుందన్నారు.



నాడు బురదమయంగా ఉన్న జాలాది-కొప్పర్రు డొంక మార్గం

మురుగు కాల్వల్లో పూడికతీత



పూడిక పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

వినుకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పట్టణంలోని ప్రధాన డ్రైనేజీల్లోని పూడిక తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. రాబోయే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో మేజర్ డ్రెయిన్లలో డీసల్టేషన్ పనులు చేస్తున్నారు. పట్టణంలోని మెయిన్ బజారు, నరసరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్, ఇసుకవాగు మెయిన్ డ్రైనేజీల్లో పనులు జరుగుతున్నాయి. పురపాలక సంఘం పరిధిలో ఎటువంటి వరదలు సంభవించకుండా, రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా నివారించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 202 నియమాలకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం పట్టణానికి కేటాయించిన రూ.44.59లక్షల నిధులతో పలు విడతలుగా కాలువ పూడికతీత పనులను చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా రానున్న తొలి ఏకాదశి పండుగ సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని రహదారులను కూడా బాగు చేస్తున్నారు.







కొనకంచివారిపాలెంలో విద్యుత్ వైర్లు చోరీ

రొంపిచర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనకంచివారిపాలెం పొలాల్లోని విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పొనుగోటి వెంకటేశ్వర్లు, గరికపాటి వెంకటేశ్వర్లు, జాగర్లమూడి నాసరావు, వడ్లమూడి రామయ్యలకు చెందిన సుమారు రెండువందల మీటర్ల, రాగి, అల్యూమినియం వైరు చోరీకి గురైనట్టు రైతులు తెలిపారు. రూ.20వేలు విలువచేసే సామగ్రి చోరీకి గురైనట్టు పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం రెడ్డిపాలెం సమీపంలోని పొలాల్లో విద్యుత్ మోటారు వద్ద ఉన్న వైరు చోరీకి గురైంది.

'అసిస్ట్' సహకారంతో గొట్టపు బావుల నిర్మాణం

చిలకలూరిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేవా సంస్థ అసిస్ట్ సహకారంతో పట్టణంలోని 10, 11 వార్డులలో రెండు గొట్టపు బావుల నిర్మాణాన్ని గత రెండు రోజులుగా జరిపారు. ఆయా వార్డులలో నీటి సమస్య ఉండడంతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి మేరకు అసిస్ట్ సంస్థ స్పందించి బావుల నిర్మాణం పూర్తిచేసింది. నిర్మాణ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, 11వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బెజ్జం రవి, ఆయా వార్డుల ప్రముఖులు అబ్దుల్ మజీద్, కరిముల్లా, మహ్మద్ రఫీ, షేక్ దరియావలి, మౌలా, రఫీ పాల్గొన్నారు.

జాతీయస్థాయి సదస్సుకు ఇద్దరు చైర్మన్‌ల ఎంపిక

చిలకలూరిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హర్యానాలోని గురుగ్రామ్‌లో జూలై 3, 4 తేదీలలో జరిగే జాతీయస్థాయి సదస్సుకు పల్నాడు జిల్లా నుంచి ఇద్దరు మున్సిపల్ చైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు మున్సిపల్ పాలనశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఎంపికైన వారిలో చిలకలూరిపేట మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ ఉన్నారు. భారత పార్లమెంట్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, పట్టణ, స్థానిక సంస్థల చైర్మన్‌లకు 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై అవగాహన కల్పిస్తారు. రాష్ట్రం నుంచి మొత్తం 25మందిని ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వీరికి నోడల్ ఆఫీసర్‌గా రాజమండ్రి మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ నాగ నరసింహారావు వ్యవహరిస్తారు.

శంకర భారతీపురం ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

నరసరావుపేట టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ స్థానిక శంకర భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బొగ్గారపు సుజాతకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. బొగ్గారపు సుజాత నరసరావుపేట లూథరన్ హైస్కూల్ ఫర్ ది బ్లైండ్‌లో చదువుకొని ఇప్పుడు శంకరభారతిపురం జడ్పీ హైస్కూల్ పనిచేస్తున్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ తన సేవలు గుర్తించి చెన్నైలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారని సుజాత ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సుజాతను అభినందించారు.

రామశేషగిరిరావుకు సన్మానం

నరసరావుపేట రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎంఏఎం కాలేజీ చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావును శ్రీఆర్యవైశ్య అన్నదాన సత్రం కమిటీ కన్వీనర్ బత్తుల మురళి, కమిటీ సభ్యులు సన్మానించారు. మండలంలోని ఇస్సపాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానం ఎదుట ఉన్న శ్రీఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ప్రతి ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన అన్నదానంను ముఖ్యఅతిథిగా రామశేషగిరావు పాల్గొని ప్రారంభించారు.

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి

● నరసరావుపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి

శావల్యాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మధ్య తరగతి గృహవిద్యుత్ వినియోగదారుల సౌకర్యం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారుంతా సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భవనం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యఘర్ పథకానికి పల్నాడు జిల్లా పరిధిలో లక్షమంది వినియోగదారులతో రిజిస్ట్రేషన్లు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా కేటాయించగా ప్రస్తుతం 80వేలమంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలిపారు. సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 1కిలోవాట్‌కు రూ.30వేలు, 2కిలోవాట్‌లకు రూ.60వేలు, 3కిలోవాట్‌లకు రూ.78వేలు రాయితీని అందిస్తుందన్నారు. 3కిలోవాట్‌లకు దరకాస్తు చేసుకొన్న బీసీ వినియోగదారులకు కేంద్రప్రభుత్వమిచ్చే రూ.78వేలు రాయితీకి రాష్ట్రప్రభుత్వం మరో రూ.20వేలు కలిపి రూ.98వేలను రాయితీగా అందిస్తుందన్నారు. 1కిలోవాట్ పూర్తిధర రూ.65వేలు, 2కిలోవాట్ పూర్తి ధర రూ1.30లక్షలు, 3కిలోవాట్‌ల పూర్తిధర రూ.1.95లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందని, నెల రోజుల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీని లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. పూర్తి ధరను చెల్లించలేనివారికి సోలార్ వెండర్‌లు బ్యాంక్ రుణాలను కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు. 1కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ 120 యూనిట్‌లు, 2 కిలోవాట్‌ల ప్లాంట్ 240 యూనిట్లు, 3కిలోవాట్‌ల ప్లాంట్ 360 యూనిట్లు వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, గృహ యజమానులు వినియోగించిన యూనిట్లు పోను మిగిలిన యూనిట్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరను ప్రతి 6 నెలలకోసారి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకొన్న వారు 6 సంవత్సరాల్లో పెట్టిన పెట్టుబడిని తిరిగి సంపాదించుకోవచ్చన్నారు. 1కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ఇంటి పైకప్పుపై సుమారు 10చ.మీ స్థలం అవసరమవుతుందన్నారు. సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు 6 నెలల విద్యుత్ బిల్లుల కాపీలు జతచేసి తమ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో గానీ, ఆన్‌లైన్‌లో గానీ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. శావల్యాపురం సబ్‌స్టేషన్ ఏఈ నటరాజ్, ఎల్ఐలు ఏడుకొండలు, శివకాంత్ పాల్గొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్, సిబ్బంది

రౌడీలకు చిలకలూరిపేట రూరల్ పోలీసుల కౌన్సెలింగ్

చిలకలూరిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీలకు ఆదివారం రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీలను ఆయన స్టేషన్‌కు పిలిపించి చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలలో పాల్గొంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటామన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.




వినుకొండలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న నూతన కార్యవర్గ సభ్యులు

ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

వినుకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్ (నెల్లూరు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేదం హరిప్రసాద్ (తిరుపతి), రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గాలి శ్రీనివాసరావు (వినుకొండ), రాష్ట్ర కోశాధికారిగా ఉమామహేశ్వరరావు, కడపలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ పూర్వాధ్యక్షుడు వెంకటరామరాజు, పల్నాడు జిల్లా సంఘం అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణ ప్రసాద్, కార్యదర్శి వాసుదేవరావు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి అజయ్ కుమార్ అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకారం జూలై 13న నెల్లూరులో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వెంకటరామరాజు, ప్రసాద్ తెలియజేశారు.

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నాదెండ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూబాడులోని పంచాయతీ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. తక్కువ ఎత్తులో దిమ్మెను నిర్మించి దానిపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. చిన్న పిల్లలు చేతికి అందే విధంగా ఫీజులు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పిచ్చిమొక్కలు పైదాక అల్లుకుపోయాయి. ప్రమాదభరితంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు పెంచటమో లేక ఆ ప్రాంతం నుంచి గ్రామం చివరకు మార్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

నాటు సారా, కల్తీ మద్యంపై అప్రమత్తంగా ఉండాలి

● ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

ఈపూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నాటు సారా, కల్తీ మద్యం, నకిలీ మద్యం, కల్తీ కల్లుపై అప్రమత్తంగా ఉండాలని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు, రొంపిచర్ల మండలాలలోని గ్రామాలలో నాటుసారా అనుమానిత ప్రాంతాలలో దాడులు, తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటుసారాయి, కల్తీ మద్యం, నకిలీ మద్యం, కల్తీకల్లు గురించి ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలన్నారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వైసీపీ నేతలపై కేసు నమోదు

నాదెండ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డారని చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన అన్నవరపు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ గ్రామ వైసీపీ నేతలపై నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావు 27వ తేదీన తూబాడులోని తన కుమార్తె వద్దకు వెళ్తుండగా గ్రామానికి చెందిన సింగారెడ్డి కోటిరెడ్డి, ఆయన కుమారుడు శ్రీకాంత్‌రెడ్డిలు దాడి చేసినట్టు ఫిర్యాదు చేశారన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులో సాక్షిగా ఉంటావా అంటూ వారిద్దరు బెదిరింపులకు పాల్పడినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

సామ్రాజ్యవాదంతో రగిలిపోతున్న అమెరికా

● ఆంజనేయరెడ్డి

రొంపిచర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద లక్షణాలతో అమెరికా రగిలిపోతోందని వామపక్ష సీనియర్ నాయకుడు ఆంజనేయరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని అన్నవరంలో ఇరాన్‌పై అమెరికా దాడిని నిరశిస్తూ ప్రజా సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం వల్ల ఆయా దేశ ప్రజలపై ప్రభావాలు పడతాయన్నారు. ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. అమెరికా అండతో పాలస్తీనాలోని గాజాను ఇజ్రాయేలు నేలమట్టంచేసి 60వేల మంది అమాయక ప్రజలను బలితీసుకుందన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయేలు విరుచుకుపడటం ఒక్క రోజులోనే వంద ప్రధాన లక్ష్యాలపై దాడిచేసి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు రైతులకు, ప్రజలకు ఆత్మహత్యలను ప్రసాదిస్తున్నాయన్నారు. గిట్టుబాటు కాక మద్దతు ధర కోసం రైతాంగం అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వాల్లో చలనం లేదన్నారు. రైతులు గ్రామ స్థాయిలో చర్చించి ప్రజల్లో చైతన్యం నింపేలా చేయాలన్నారు. సదస్సులో అన్నవరం పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.